# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 84
పేజీలు : 08 | వెల: రూ.5/-

మంగళవారం
డిసెంబర్ 17, 2024

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net





## టీఆర్పీఎస్ రాష్ట్ర కమిటీలో శాయంపేటకు పెద్ద పీట

పద్మశాలి భవన నిర్మాణ ఇంచార్జిగా బాసాని చంద్రప్రకాశ్

8లో..



వివరాలు2లో..

# వారే సూత్రధారులు

- అధికారులు, ప్రజా ప్రతినిధుల అండతో ఇసుక అక్రమ రవాణా
- తూతూ మంత్రపు కేసులు
- మామూళ్ల మత్తులో అధికారులు
- ట్రాక్టర్ల తరలింపుతో పంటపొలాలు నాశనం
- లక్షలు దండుకుంటున్న దళారులు

వరంగల్ జిల్లా, పర్వతగిరి మండలంలోని నారాయణపురం, రోళ్లకల్, చెరువు ముందు తండా, కల్లెడ శివారులోని అకేరు వాగు ఇసుక అక్రమాలకు అడ్డాగా మారింది. రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక వ్యాపారం జోరుగా సాగుతోంది. అయితే గత కొంత కాలంగా స్తబ్దుగా ఉన్న ఇసుక అక్రమ రవాణ అధికారులు, ప్రజా ప్రతినిధుల అండదండలతో మళ్లీ ఊపందుకుంది. మూడు టిప్పర్లు.. ఆరు ట్రాక్టర్లు అన్నట్లుగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. అయితే ఇందులో అధికారులు, పాలకులు సూత్రధారులైతే దళారులు పాత్రధారులుగా వ్యవహరిస్తున్నారు. ప్రతీది లెక్క ప్రకారం చేస్తూ అందరూ కలిసి పంచుకుంటున్నారు. అయితే గతంలో మాదిరిగా నెలకింతా అన్నట్లు కాకుండా ఒక్కో ట్రాక్టర్ కు ఇంత అంటూ రేట్ ఫిక్స్ చేసి ఒక రోజు ఎన్ని ట్రాక్టర్ల ఇసుక రవాణా అవుతుందో లెక్కగట్టి ఆమేరకు వసూళ్ల పర్వాన్ని కొనసాగిస్తున్నారు. దీంతో ఇసుక అక్రమ రవాణాలో వారు కూడా భాగస్వాములుగా మారడంతో తోడుకున్నోళ్లకు తోడుకున్నంత అన్నట్లుగా మారింది. అందువల్లే అక్రమ దందాను చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. తప్పని పరిస్థితి ఏర్పడితే తూతూ మంత్రంగా కేసులు పెట్టి చేతులు దులుపుకుంటున్నట్లు సమాచారం.

- వరంగల్ వాయిస్, పర్వతగిరి



8లో..

## క్రీడలను ప్రోత్సహిస్తున్నాం..

- అందుకే జిల్లా స్థాయిల్లో సీఎం కప్ పోటీలు
- అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- హైదరాబాద్ నుంచి వర్చువల్ గా ప్రారంభం

## రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో శాంతిహోమం

- కబేళాలకు రాజన్న కోడెలు తరలించిన పాపానికి ప్రక్షాళన
- గోషాలను శుద్ధి చేసిన బీఆర్ఎస్ నేతలు



2లో..




8లో..

## ధైర్యంగా ఫిర్యాదు చేయండి

- మహిళలకు షీ టీం రక్షణ
- షీ టీమ్ ఎస్సై విద్యాసాగర్

# వారే సూత్రధారులు



- అధికారులు, ప్రజా ప్రతినిధుల అండతో ఇసుక అక్రమ రవాణా
- తూతూ మంత్రపు కేసులు
- మాముళ్ల మత్తులో అధికారులు
- ట్రాక్టర్ల తరలింపుతో పంటపొలాలు నాశనం
- లక్షలు దండుకుంటున్న దళారులు

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** గత కొంత కాలంగా స్థబ్దుగా ఉన్న ఇసుక అక్రమ దందా మళ్లీ జడలు విప్పుకుంది. ఇక్కడ జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాపై వివిధ పత్రికల్లో పుంఖాను పుంకాలుగా కథనాలు రావడంతో అంతా సైలెంట్ అయిపోయారు. అయితే రాజకీయ నాయకులు, అధికారులు సూత్రదారులుగా మారడంతో మళ్లీ ఇసుక అక్రమ రవాణా మూడు టిప్పర్లు..ఆరు ట్రాక్టర్లుగా సాగుతోంది. రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక అక్రమంగా రావాణా అవుతోంది. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అకేరు వాగులో నుంచి ఇసుక తరలిస్తున్నట్లు అధికారులకు తెలిసినప్పటికీ చూసి చూడనట్లు వ్యవహరించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**కనిపించని నెంబర్ ప్లేట్..**

ఇసుక అక్రమ తరలింపులో దళారులు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. వారు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లకు ఎటువంటి రిజిస్ట్రేషన్ నెంబర్ ప్లేట్ లేకపోవడం గమనార్హం. అసలు నెంబర్ ప్లేట్ లేకుండా రోడ్డుపైకి వస్తే కేసులు నమోదు చేసే ఆర్టీఏ అధికారులు, పోలీసులు ఇసుక ట్రాక్టర్ల విషయంలో ఉదాసీనత ప్రదర్శించడం ఏమిటని పలువురు నిలదీస్తున్నారు. ఇసుక అక్రమ వ్యాపారుల నుంచి సంబంధిత అధికారులకు, రాజకీయ నాయకులకు పెద్ద మొత్తంలో మామూళ్లు అందుతున్నందునే వారు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. అయితే గత కొంత కాలంగా స్థానిక ప్రజాప్రతినిధుల అండ, అధికారుల భరోసాతోనే ఇసుక అక్రమ వ్యాపారాన్ని యథేచ్ఛగా నిర్వహిస్తున్నట్లు సమాచారం. మేము ఆఫీసర్లకు చెప్పే అక్రమంగా ఇసుక రవాణా చేసుకుంటున్నామంటూ అక్రమార్కులు నిర్భయంగా చెబుతున్నారంటే దీని వెనుక ఎలాంటి బలమైన ఒప్పందం ఉందో అర్థమవుతోంది.

**పాడవుతున్న పొలాలు..**

ఇసుక ట్రాక్టర్ల రవాణాతో ఆకేరు వాగు సమీపంలో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ పంట పొలాలు, చేలల్లో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి పంటకు పనికిరాకుండా తయారవుతోందని రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. రాత్రింబవళ్లు సాగుతున్న ఇసుక అక్రమ రవాణాపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇసుక తరలింపుతో వాతావరణ సమతుల్యత దెబ్బతిని భూగర్భజలాలు అడుగంటిపోతాయని, ఫలితంగా తాగు నీటి కొరత ఏర్పడుతోందని చుట్టు పక్కల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

**కన్నెత్తి చూడని రెవెన్యూశాఖ..**

పర్వతగిరి మండలంలోని నారాయణ పురం, రోళ్లకల్, చెరువు ముందు తండా శివారులోని అకేరువాగులో ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నా రెవెన్యూ శాఖ అధికారులు అటు వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు. జేసీబీలను ఉపయోగించి ఆకేరు వాగును లూటీ చేస్తున్నా పోలీసుల స్పందన కరువైందంటున్నారు. అయితే ఆయా ప్రాంతాలనుంచి ఇసుక లోడ్ చేసుకుని వస్తున్న ట్రాక్టర్లను మాత్రం పట్టుకుని తూ తూ మంత్రపు కేసులు పెట్టి అనంతరం పైరవీలతో వదిలివేస్తూ జేబులు నింపుకుంటున్నట్లు ఫిర్యాదులున్నాయి.

అధికార పార్టీ నాయకుల హవా..

అయితే అధికార పార్టీ నాయకుల అండదండలతోనే ఇసుక అక్రమ రవాణా సాగుతోందన్న ప్రచారం ఉంది. ఇసుక అక్రమ రవాణాతో ప్రజా ప్రతినిధిలు, అధికారులు, దళారులు పెద్ద మొత్తంలో కూడబెడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికార పార్టీ నాయకులు ఇటు ఇసుక మాఫియాతో పాటు ట్రాక్టర్ ఓనర్స్ తో దోస్తీ చేస్తూ జేబులు నింపుకుంటున్నారంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**కళ్లు తెరవాలి..**

మండలంలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణా దందాను ఆపడానికి మైనింగ్ శాఖ అధికారులు ధైర్యం చేసినట్లు కనిపించడం లేదు. ఎందుకంటే అటు అధికార పార్టీ ప్రజాప్రతినిధుల బెదిరింపులు, ఇసుక మాఫియా నుంచి అందుతున్న ప్యాకెట్ లతో సంతోషపడి అటు పక్కకు వెళ్లి వారిపై చర్యలు తీసుకోవడానికి జంకుతున్నట్లు ఆయా గ్రామాల్లోని ప్రజలు చెప్పుకొంటున్నారు. అయితే మైనింగ్ శాఖ అధికారులు ఇప్పటికైనా కళ్లు తెరిచి ఇసుక అక్రమ తవ్వకాలను నిలిపివేయాలంటున్నారు. తద్వారా భూగర్భ జలాలు పెరిగి ప్రజలకు తాగు, సాగు నీటి కష్టాలు తప్పుతాయంటున్నారు. ఈ దిశగా మైనింగ్ అధికారులు స్పందించాలంటున్నారు.







# రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో శాంతిహోమం

- కబేళాలకు రాజన్న కోడెలు తరలించిన పాపానికి ప్రక్షాళన
- గోషాలను శుద్ధి చేసిన బీఆర్ఎస్ నేతలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వేములవాడ రాజన్న కోడెలను మంత్రి కొండా సురేఖ సిఫారసుతో అక్రమంగా కబేళాలకు తరలించిన పాపానికి ప్రాయశ్చిత్తం కోసం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎనుగుల రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రాజన్న సన్నిధిలో శాంతిహోమం నిర్వహించారు. హనుమకొండ నుంచి తీసుకొచ్చిన కోడెను ఆలయంలో సమర్పించారు. వేములవాడ మునిసిపల్ చైర్మన్ రామతీర్థపు మాధవిరాజు, ఇతర సీనియర్ నాయకులతో కలిసి వేములవాడ గోషాలను శుద్ధి చేశారు. ఈ సందర్భంగా రాకేష్ రెడ్డి మాట్లాడుతూ పరమ శివుడికి ఆగ్రహం వస్తే ముల్లోకాల్లో విలయతాండవం చేస్తాడని, అలాంటిది ఏకంగా శివుడి వాహనమైన నందినే కబేళాలకు తరలించి కాంగ్రెస్ పార్టీ తన గొయ్యి తానే తీసుకుందన్నారు. దీంతో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కాశీకి వెళ్లినా ఆమె పాపం పోదన్నారు. ఎందుకంటే స్వయంగా ఆ రాజన్న కోడెలకే ఆమె అపచారం చేసిందన్నారు. ఆమె కొండా సురేఖ కాదు.. కాసుల కోసం కోడెలను కబేళాలకు పంపిన కసాయి సురేఖ అన్నారు. ఆమె అమ్మింది కోడెలను కాదు కోట్లాది హిందువుల ఆచారాలను, నమ్మకాలను, విశ్వాసాలను అన్నారు. కోట్లాది హిందువుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచనలతో వేములవాడకు కోడె మొక్కులు చెల్లించుకోవడం జరిగిందన్నారు. రాజైనా, మంత్రైనా తప్పు చేసినపుడు ఆ ప్రభావం రాజ్యం మీద, ప్రజల మీద ఉంటుందన్నారు. అందుకే ఆ ప్రభావం నుంచి ప్రజలను రక్షించుకోవడం కోసమే బీఆర్ఎస్ పక్షాన ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. బాధ్యతగల మంత్రి పదవిలో ఉన్న కొండా సురేఖా ిప్పటికీ ఈ ఘటనపై సమాధానం చెప్పలేదన్నారు. వేములవాడ రాజన్న సన్నిధిలో వరుసగా జరుగుతున్న అపచారాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మంత్రి సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. లేదా వారే నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి పదవికి రాజీనామా చెయాలన్నారు. కోడెల అమ్మకంలో ప్రధాన పాత్రధారులందరిపై పీడీ యాక్ట్ నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేవుడి సొమ్ము, హుండీలో భక్తులు సమర్పించిన కానులను రూ.2 కోట్లు దోచుకొని కాంగ్రెస్ విజయోత్సవ సభ నిర్వహించి రూ.32 వేలకు ఒక్క బిర్యానీ చొప్పున వంద బిర్యానీలు తిన్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పాలనలో దేవుడి సొమ్ముకే రక్షణ లేదు ఇక ప్రజల సొమ్ముకు రక్షణ ఎక్కడుందని ప్రశ్నించారు. దేవుడి సొమ్ముకు ధర్మ కర్తగా ఉండాల్సిన ప్రభుత్వమే దేవుడి గల్లాపెట్టెను దొంగతనం చేస్తోందన్నారు. మిమ్మల్ని ప్రజలు క్షమించినా ఆ భగవంతుడు క్షమించడన్నారు. ధర్మం జోలికి వెళ్లిన ఎవ్వరు కూడా పొడుగేళ్లలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి దీనికి బాధ్యత వహిస్తూ తక్షణమే స్పందించాలని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన ఏనుగుల రాకేష్ రెడ్డి డిమాండ్ చేశారు.



# హోరా హోరీగా షటిల్ టోర్నీ

## ➲ విజేతలకు సీఐ బహుమతుల పంపిణీ



**వరంగల్ వాయిస్, కాటారం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని సువిద్య హైస్కూల్లో జరిగిన మండల స్థాయి షటిల్ టోర్నీ హోరాహోరీగా ముగిసింది. సోమవారం సాయంత్రం సువిద్య స్కూల్ ఆవరణలో ఏర్పాటుచేసిన బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి కాటారం సీఐ నాగార్జున రావు, ఎస్సై అభినవ్, జిల్లా అథ్లెటిక్స్ కార్యదర్శి పూతల సమ్మయ్య, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, సువిద్య స్కూల్ చైర్మన్ కొట్టే శ్రీశైలం, నిర్వాహకులు ఆత్మకూరి కుమార్ పాల్గొన్నారు. సుమారు 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ నాగార్జున రావు మాట్లాడుతూ క్రీడలు దేహదారుఢ్యానికి, దృఢత్వానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. ఉద్యోగ అవకాశాలలో క్రీడల రిజర్వేషన్ పొందవచ్చని సూచించారు. క్రీడల హబ్ కేంద్రంగా కాటారం తయారవుతున్న నేపథ్యంలో పోలీసు శాఖ ద్వారా సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు, సువిద్యా స్కూల్ తరహాలో ఇతర విద్యాసంస్థలు టోర్నమెంట్లు నిర్వహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రీడలను నిర్వహించినందుకు సువిద్య స్కూల్ చైర్మన్ కొట్టే శ్రీశైలంను అతిథులు అభినందించి, ఘనంగా సన్మానించారు. మారుమూల ప్రాంతంలోని క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. సువిద్య స్కూల్ చైర్మన్ కొట్టే శ్రీశైలం మాట్లాడుతూ క్రీడాకారుల్లో నైపుణ్యతను వెలికితీయడానికి టోర్నమెంట్ నిర్వహించామన్నారు. టోర్నీ ప్రారంభంలో శ్రీపాద చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దుద్దిల్ల శ్రీను బాబు రాగా కాటారంలో ఇండోర్ స్టేడియం స్థల సేకరణ విషయాన్ని విన్నవించామని, మంత్రి శ్రీధర్ బాబు ద్వారా జిల్లా కలెక్టర్ కు నివేదించినట్లు వివరించారు. మొదటి బహుమతి ఊదరి ఉదయ్, మంత్రి ప్రవీణ్ జట్టు కాగా ద్వితీయ బహుమతి కడారి శేఖర్, లింగమూర్తి జట్టు, తృతీయ బహుమతి జోడు శ్రీనివాస్, దుంపల నవీన్ లకు బహుమతులు అందజేశారు. ఇదిలా ఉండగా బెస్ట్ ప్లేయర్ అవార్డు మెరుగు వరుణ్ కు నగదు బహుమతిని కామెడీ శ్రీనివాసరెడ్డి ప్రకటించి అందజేశారు.

# పలిమెల భూ అక్రమాలపై "కోట" ఫైర్ !

## మంత్రి శ్రీధర్ బాబు, కలెక్టర్ రాహుల్ శర్మకు వినతి

## తహసిల్దార్ సస్పెన్షన్?



**వరంగల్ వాయిస్, కాటారం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలంలో జరుగుతున్న భూ అక్రమాలపై మహాదేవపూర్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోట రాజబాబు గౌడ్ ఫైర్ అయ్యారు. మారుమూల ఆటవిక గిరిజన ప్రాంతమైన పలిమెల మండలంలో ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది బినామీ వ్యక్తులు అధికారులతో అక్రమాలకు పాల్పడుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. పలిమల మండలంలో 50ఏళ్లకు పైగా కాస్తు సాగు చేసుకుంటున్నా భూ కమతాలను కొంతమంది భూస్వాములు వారికి తెలియకుండానే అధికారులతో అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని ఆరోపించారు. సుమారు 102 ఎకరాల భూములను కొంతమంది దక్కన్ సిమెంట్ కంపెనీకి అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేశారని, వీటిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని రాజబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకు విన్నవించగా, భూములపై పూర్తి వివరాలు నివేదిక సమర్పించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను ఆదేశించారు. ఈ నేపథ్యంలో పలిమల భూముల అక్రమాలపై కాటారం సబ్ కలెక్టర్ మాయాంక్ సింగ్ ను కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఇదిలా ఉండగా పలిమెల తహసీల్దార్ సయ్యద్ సర్వర్ ను మంగళవారం సస్పెన్షన్ చేసినట్లు సమాచారం. సీసీఎల్ఏ సమగ్ర దర్యాప్తు నివేదిక సమర్పించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడినట్లు సమాచారం.

# బాధిత కుటుంబానికి చేయూత



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎలుగూరు రైలు ప్రమాదంలో మరణించిన పాయింట్స్ మెన్ కుటుంబానికి మజ్దూర్ యూనియన్ రూ.50,000 అందజేశారు. వరంగల్ పరిధిలోని ఎలుగురు రైల్వేస్టేషన్లో పాయింట్స్ మెన్ గా విధులు నిర్వహిస్తున్న రమేష్ ఆన్ డ్యూటీలో రైలు ప్రమాదంలో మరణించగా వరంగల్ ఎంజీఎంలో రమేష్ పార్థివ దేహాన్ని మద్దూర్ యూనియన్ నాయకులు సందర్శించి నివాళులు అర్పించారు. యూనియన్ సభ్యత్వం కలిగి ఉన్న రమేష్ కుటుంబానికి డివిజినల్ సెక్రెటరీ పి.రవీందర్ ఆదేశాల మేరకు మజ్దూర్ యూనియన్ మంగళవారం రూ.50,000లను కాజీపేట యూనియన్ సెక్రటరీ ఆర్ సమ్మయ్య, వరంగల్ బ్రాంచ్ సెక్రటరీ యుగంధర్ చైర్మన్ ముకుందం చేతుల మీదుగా రెండు లక్షల లో 50,000 రమేష్ భార్య రజితకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుధాకర్ రాజేష్, యూత్ ప్రెసిడెంట్ ముత్యాల విజయ్, సురేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# 22న పట్టు రైతుల రాష్ట్ర సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి

## ➲ పట్టు రైతు సంఘం రాష్ట్ర భాద్యులు మూడు శోభన్



**వరంగల్ వాయిస్, జనగామ :** ఈనెల 22న జరగనున్న పట్టు రైతుల రాష్ట్ర సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ పట్టు రైతు సంఘం రాష్ట్ర భాద్యులు మూడ్ శోభన్ పట్టు రైతులను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సమ్మేళనానికి ఉద్యాన వన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ దండరాజి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా జనగామ జిల్లాలో పట్టు రైతులను నేరుగా కలిసి ఆహ్వానం అందించి రాష్ట్రవ్యాప్తంగా పట్టు రైతులు ఎదుర్కొనే సమస్యలపై చర్చించి భవిష్యత్తులో సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు పోరాటాలు రూపొందించుకోవడం కోసం ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పట్టు రైతుల పెండింగ్ ఇన్సెంటివ్ తక్షణమే విడుదల చేయాలని, 100శాతం సబ్సిడీతో షెడ్డు నిర్మాణానికి నిధులు ఇవ్వాలని, అదేవిధంగా రైతులు పట్టుగుళ్లను విక్రయించిన వెంటనే వారి ఖాతాలో డబ్బులు జమ చేయాలని, అదేవిధంగా ప్రభుత్వమే పట్టు పురుగుల నాణ్యమైన గుడ్లను సబ్సిడీతో రైతులకు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టు రైతులు శ్రీధర్ గౌడ్, భూక్యా చందు నాయక్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# లగచర్ల రైతులను వెంటనే విడుదల చేయాలి

## బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు సనత్



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ లో లగచర్ల రైతులను వెంటనే విడుదల చేయాలని పరకాల మండల యూత్ అధ్యక్షుడు శాతరాశి సనత్ కుమార్ మంగళవారం డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు అంబేద్కర్ విగ్రహాలకు వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి, వారిపైన థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించి, రైతన్నల చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, అమానవీయ, అణిచివేత విధానాలకు విడనాడాలని, రైతన్నలపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసి, వారిని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# టీఆర్ పీఎస్ మీడియా రాష్ట్ర కార్యదర్శిగా చింతకింది కృష్ణమూర్తి





**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం మీడియా రాష్ట్ర కార్యదర్శిగా జనగాం జిల్లా రఘునాథపల్లి గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు చింతకింది కృష్ణమూర్తి పద్మశాలిని నియమిస్తూ మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు వల్లపాటి రాజకుమార్ నియామకపత్రాన్ని అందజేశారు. హైదరాబాదులో ప్రమాణ స్వీకారం సందర్భంగా ఆయనను నియమించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో తెలంగాణ వ్యాప్తంగా పద్మశాలి సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ ఎప్పటికప్పుడు మీడియాప్రచారం చేస్తానని ఆయన అన్నారు. పద్మశాలి సమాజాభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతూ అందరికీ అందుబాటులో ఉంటూ నిబద్ధతతో పని చేస్తానని తెలిపారు.

# అదనపు డీసీపీ సంజీవ్ కు డీసీపీగా పదోన్నతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో ఆర్మ్ డ్ రిజర్వుడ్ విభాగం అదనపు డీసీపీగా విధులు నిర్వహిస్తున్న పి.సంజీవ్ కు పదోన్నతిపై సైబరాబాద్ కమిషనరేట్ ఆర్మ్డ్ రిజర్వుడ్ విభాగం డీసీపీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన డీసీపీ సంజీవ్ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మర్యాదపూర్వకం కలుసుకొని మొక్కను అందజేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ సంజీవ్ కు అభినందనలు తెలియజేశారు. పదోన్నతులతో పాటు బాధ్యతలు పెరుగుతాయని, అప్పగించిన పనులను సమర్ధవంతంగా నిర్వహించే అధికారులు విధుల్లో రాణిస్తారని పోలీస్ కమిషనర్ తెలిపారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
మంగళవారం, డిసెంబర్ 17, 2024

## అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ తూర్పు నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ ఆధ్వర్యంలో లగచర్ల గిరిజన రైతులను వెంటనే విడుదల చేయాలని కాశిబుగ్గ జంక్షన్ లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 19వ, 20వ డివిజన్ అధ్యక్షులు చిలువేరు పవన్, ఎండీ ఇక్బాల్, జక్కీ యుగంధర్, ఆడెపు కార్తీక్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన



**వరంగల్ వాయిస్, నడికూడ :** లగచర్ల రైతులపై కేసులను ఎత్తివేయాలని, దళిత, బహుజన రైతులపై రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దమనకాండను నిరసిస్తూ, బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు మంగళవారం నడికూడ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో భూములు ఇవ్వని రైతులపై ప్రభుత్వం చేస్తున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తిప్పర్తి సాంబశివరెడ్డి, నాగిరెడ్డి, సుధాటి వెంకన్న, రావుల రాజిరెడ్డి, పోశాల భిక్షపతి, రాసమల్ల మల్లికార్జున్, దురిశెట్టి వెంకటేష్, గుడి కందుల శివ, ముత్యం నరేష్, రావుల కిషన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నూతన కమిటీ ఎన్నిక



**వరంగల్ వాయిస్, పరకాల :** కామారెడ్డి పల్లె మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నూతన గ్రామ కమిటీ నిర్మాణం మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నూతన గ్రామ కమిటీలను పునర్ నిర్మాణం చేయడంలో భాగంగా మంగళవారం పరకాల మండలంలోని కామారెడ్డి పల్లె గ్రామ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఏకు శంకర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి పరకాల మండల ఇంచార్జి నూతన గ్రామ కమిటీని ప్రకటించారు. కామారెడ్డి పల్లె ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా హనుమకొండ విజయ్ కుమార్, అధికార ప్రతినిధిగా కోయిల కోకిల శ్రీకాంత్ మాదిగ, ఉపాధ్యక్షులుగా కొయ్యడ అఖిల్ మాదిగ, తిక్క రాజు మాదిగ, ప్రధాన కార్యదర్శిగా కొయ్యడ కుమార్ మాదిగ, కార్యదర్శులుగా ఈర్ల శంకర్ మాదిగ, కనకం రాజు మాదిగ, కోశాధికారిగా బండారి రాజు మాదిగ, సలహాదారుగా బుర్ర రాజయ్య మాదిగ, పెండల చంద్రమౌళి మాదిగ, శ్రీపతి శ్రీను మాదిగ, వంగల లాల్ ప్రసాద్ మాదిగ, తిక్క బన్నీ మాదిగలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో తిక్క శీను మాదిగ, తిక్క శ్రీధర్ మాదిగ, విష్ణు మాదిగ, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు, కామారెడ్డి పల్లె గ్రామ రక్త బంధువులు, కుల పెద్దలు పాల్గొన్నారు.

# పుట్టిన రోజున సేవా కార్యక్రమాలు అభినందనీయం

### ▪ పూర్వ జిల్లా గవర్నర్ లయన్ కన్నా



**వరంగల్ వాయిస్, జనగామ :** పుట్టిన రోజు వేడుక సందర్భంగా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని లయన్స్ ఇంటర్నేషనల్ పూర్వ జిల్లా గవర్నర్ లయన్ కన్నా పరశురాములు అన్నారు. మంగళవారం ఉదయం జనగామ మిలీనియం క్లబ్ పూర్వ అధ్యక్షుడు, పూర్వ రీజియన్ చైర్మన్ లయన్ శ్రీరామ్ శ్రీనివాస్ 54వ పుట్టినరోజు సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు గాదే నరసింహులు అధ్యక్షతన నిర్వహించిన సేవా కార్యక్రమాలలో లయన్ కన్నా ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. వీవర్స్ కాలనీలోని ఎల్లమ్మ దేవాలయం ప్రాంగణం వద్ద నాలుగు సిమెంట్ బెంచీలను వితరణ చేశారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం కింద మొక్కలు నాటారు. తదుపరి షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్ష నిర్వహించారు. పుట్టినరోజు సందర్భం పురస్కరించుకొని 37వ సారి ఆయన రక్త దానం చేశారు. స్థానిక బ్లడ్ బ్యాంకులో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్ అభిమానులు మరో ముగ్గురు బండ భిక్షపతి, సూరారం రాజు, రచ్చ శివ రక్త దానం చేశారు. అనంతరం రైల్వే స్టేషన్ సమీపంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు వితరణ చేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ శ్రీనివాస్ సేవా గుణాన్ని అభినందిస్తూ క్లబ్ సభ్యులు ఉపాధ్యాయులు ప్రసంగించారు. సేవా తత్త్వం గల శ్రీరామ్ శ్రీనివాస్ జనగామ మిలీనియం క్లబ్ అధ్యక్షుడిగా, జోన్ చైర్మన్ గా, రీజనల్ చైర్మన్ గా, ఇంకా వివిధ హోదాలలో పనిచేసిన కాలంలో ప్రశంసలు అందుకున్న నాయకుడు. సేవాగుణం ఉన్న ఈయన రెడ్ క్రాస్ సొసైటీ, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సంస్థల సభ్యుడిగా కూడా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా శ్రీరాం శ్రీనివాస్ ను క్లబ్ పక్షాన అధ్యక్షుడు, జిల్లా లయన్స్ పక్షాన మాజీ గవర్నర్ కన్నా పరశురాములు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ రంగరాజు, ప్రవీణ్ కుమార్, పీఆర్వో ఏనుగు నర్సిరెడ్డి, కార్యదర్శి వి.వేణుగోపాల్ రెడ్డి, కోశాధికారి బండ భిక్షపతి, పూర్వ అధ్యక్షుడు బైరు వెంకటేశ్వర్లు, కాముని శ్రీనివాస్ బాబు, వీవర్స్ కాలనీ ప్రముఖులు ఎనగందుల భిక్షపతి, కాముని సమ్మయ్య, దాసరి సుమన్ పాల్గొన్నారు.

## తప్పుడు ప్రచారాలతో పబ్బం గడుపుతున్న ప్రభుత్వం



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలు చెప్పి అసత్య ప్రచారాలతో పబ్బం గడుపుతోందని భారతీయ జనతా పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కుందూరు మహేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని దుయ్యబడ్డారు. డిసెంబర్ 9వ తేదీ సోనియా గాంధీ పుట్టినరోజు సందర్భంగా రైతు పండుగ పేరుతో మహబూబ్ నగర్ లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి రైతులకు రెండు లక్షల వరకు ఉన్న రుణాన్ని మాఫీ చేస్తున్నామని చెప్పి అన్ని ప్రధాన పత్రికల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్న ప్రభుత్వం బహిరంగ సభ ముగిసి సోనియా గాంధీ జన్మదిన వేడుకలు ఆర్భాటంగా చేసుకున్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో మాఫీ అయిన మొత్తాన్ని జమ చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అసత్య ప్రచారాలు, అబద్ధపు మాటలు మానుకొని పనులు చేసి చేతల్లో చూపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీల పేరుతో ఇప్పటికే ప్రజల్ని మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ ఏ విధంగా కూడా రైతులను మభ్యపెట్టి బ్యాంకుల చుట్టూ కాళ్లు అరిగేలా తిప్పుకుంటుందని, ఇలా చేయడం వల్ల రైతులు తమ పనులు మానుకొని ఎంతో నష్టపోవాల్సి వస్తుందని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా సక్రమంగా పనిచేయాలన్నారు. ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై పోరాటం చేస్తామని, కాంగ్రెస్ నాయకులను తిరగకుండా చేస్తామని మహేందర్ రెడ్డి అన్నారు.

## నరసింహస్వామి హుండీ కానుకల లెక్కింపు

### రూ.8,92,021 లక్షల ఆదాయం



**వరంగల్ వాయిస్, రేగొండ :** ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పేరుగాంచిన సుప్రసిద్ధ శ్రీ లక్ష్మి నరసింహ స్వామి హుండీ ఆదాయాన్ని మంగళవారం ఆలయ ముఖ మండపంలో పరకాల డివిజన్ దేవాదాయ శాఖ అధికారి ఎన్.కవిత, కార్య నిర్వహణ అధికారి ఎస్.మహేష్ పర్యవేక్షణలో లెక్కించారు. నాలుగు నెలల హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ.8,92,021 లక్షలు వచ్చాయని ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అమూల్య, హెడ్ కానిస్టేబుల్ తాళ్ల పెల్లి లింగమూర్తి, కానిస్టేబుల్ నరేష్, గ్రామ పెద్దలు డోబిలి కోటి, పబ్బ ఓదేలు, పబ్బ సమ్మయ్య, కొలుగూరి సంపత్ రావు, బ్రహ్మం, మోరే మొగిలి, భజన మండలి నిమ్మల రాజు బృందం, ఆలయ సిబ్బంది గోరంట్ల శ్రావణ్, సున్నాయిల సుధాకర్, నాగుల సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

# ఏకశిలా పాఠశాలలను మూసివేయాలి

### ◆ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆరేగంటి నాగరాజు గౌడ్



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కాకతీయ యూనివర్సిటీ ఇంచార్జి ఆరేగంటి నాగరాజు గౌడ్ ఏకశిలా పాఠశాలపైన చేసిన ఫిర్యాదు మేరకు కాకతీయ యూనివర్సిటీ మొదటి గేటు వద్ద ఉన్న ఏకశిలా పాఠశాలను సందర్శించారు. అనంతరం ఈ పాఠశాలకు అనుమతి సంబంధించిన డాక్యుమెంట్స్ ను పరిశీలించి ఏకశిలా పాఠశాలకు పర్మిషన్ ఉందని, కాకపోతే మౌలిక సదుపాయాలు లేవన్నారు. ఈ పాఠశాలకు గత అధికారులు ఏ విధంగా పర్మిషన్ ఇచ్చారో దానికి సంబంధించి నా పై అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనుమతులు లేకుండా పాఠశాలలు నడిపిస్తే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.విద్యార్థులకు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రతి పాఠశాలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని, ప్రభుత్వ నిబంధనలు లేకుంటే మాత్రం ఉపేక్షించేది లేద, తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా ప్రతి పాఠశాలలో కూడా విద్యార్థులకు ఆటలాడుకోవడానికి క్రీడా ప్రాంగణం, విద్యార్థులకు రక్షణగా ఫైర్ సేఫ్టీ, పార్కింగ్ స్థలం తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ప్రైవేట్ పాఠశాల యజమానులు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే మాత్రం ఊరుకునేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షుడు సుధగాని మధు గౌడ్, శ్రీ సాయి, తిరుపతి, కాశి, రాజ్ కుమార్, నవీన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# విస్నూర్ దేశముఖ్ పాలిట ఫిరంగి గుండు దర్గ్యా నాయక్

## ➲ సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



**వరంగల్ వాయిస్, దేవరుప్పల :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి సాక్షిగా మిగిలిన పోరాట వీరుడు దర్గ్యా నాయక్ విశ్వ రాక్షసుడు విసునూరి రామచంద్రారెడ్డి బాపు దొర పాలిట ఓ ఫిరంగి గుండు అని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు.మంగళవారం దేవరుప్పుల మండలం ధర్మపురం గ్రామంలో దర్గ్యా నాయక్(107) మృతి దేహంపై పుష్పగుచ్చం ఉంచి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అధ్యక్షతన జరిగిన సంతాప సభలో తమ్మినేని వీరభద్రం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి ఫిరంగులై దేశ్ ముఖ్ రాపాక రామచంద్రారెడ్డిని ఉరికించిన గొప్ప యోధుడు దర్గా నాయక్ అన్నారు. అతని అన్న ఠాను నాయక్ కూడా పోరాటం చేసి అమరుడయ్యాడని, ఆత్యాగాల కుటుంబంలో జన్మించిన గొప్ప వీరుడు దర్గ్యా నాయక్ అని కొనియాడారు. దర్గ్యా నాయక్ పెద్ద వదిన పూలమ్మతో పాటు సోదరులందరూ యుద్ధ వీరులై కదం తొక్కి విస్నూర్ రామచంద్రా రెడ్డి అకృత్యాలను ఎదిరించి నైజాం రజాకారు గుండాలను, పటేల్ సైన్యాలను గడగడలాడించిన ఘనత ఈకుటుంబానికే దక్కిందన్నారు. వీర తెలంగాణ పోరాట యోధురాలు ఐలమ్మ పోరాటానికి కూడా దర్గ్యా నాయక్ అండగా ఉన్నాడని గుర్తు చేశారు. తెలంగాణ రైతంగ సాయుధ పోరాట యోధురాలు భీమిరెడ్డి నరసింహారెడ్డి, నల్ల నరసింహులు, కాచం కృష్ణమూర్తి, ఏసీరెడ్డి నరసింహారెడ్డి, మల్లు స్వరాజ్యం, ఎర్రం రెడ్డి మోహన్ రెడ్డి, గబ్బెట గోపాల్ రెడ్డిలతో గెరిల్లా దళాలలో పనిచేసిన గొప్ప యోధుడు దర్గ్యా నాయక్ అని తెలిపారు. విస్నూర్ దేశ్ ముఖ్ కు కుమారుడు జగన్మోహన్ రెడ్డిని హైదరాబాదు పారిపోతుంటే జనగామ రైల్వే స్టేషన్ లో దొరకబట్టి నరికి చంపిన గొప్ప వీరుడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి గుర్తుగా నేటికి మిగిలి ఉన్న సజీవ సాక్షం దర్గ్యా నాయక్ అన్నారు. దర్గ్యా నాయకులు పోరాట పటిమను నేటి యువత స్పూర్తిగా తీసుకొని. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. 2015 సెప్టెంబర్ 10న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు ఐలమ్మ కాంస్య విగ్రహ ఆవిష్కరణకు పొలిటి బ్యూరో సభ్యులు బృందా కారత్ తో దర్గ్యా నాయకు కూడా పాలకుర్తిలో పాల్గొని విగ్రహాన్ని ప్రారంభించారు. అలాగే సెప్టెంబర్ 17 –2022న జనగామలో జరిగిన సాయుధ పోరాట వారోత్సవాలలో సీపీఎం జాతీయ కార్యదర్శి అమరజీవి కామ్రేడ్ సీతారాం ఏచూరి చేతుల మీదుగా సన్మానం పొందాడని గుర్తు చేశారు. అలాగే జనగామ జిల్లా సాధన ఉద్యమంలో కూడా జిల్లా ఇవ్వాల్సిందేనని, లేకుంటే ఊరుకునేది లేదని దీక్షా శిబిరంలో కూర్చున్న గొప్ప మహానాయకుడు అని కొనియాడారు. ఈకార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి బి వెంకట్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్, గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి ధర్మానాయక్, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి శోభాన్ నాయక్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సాంబరాజు యాదగిరి, సింగారపు రమేష్, ఇర్రి అహల్య, బొట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, చిట్యాల సోమన్న, జోగు ప్రకాష్, మండల కార్యదర్శిలు ఇంటి వెంకటరెడ్డి, మాచర్ల సారయ్య, ఏదునూరి మదర్, జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

### దర్గ్యా నాయక్ కు నివాళి ..

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ జాటోతు దర్గ్యా నాయక్ కు సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నాయకుల సారంపల్లీ వాసుదేవ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు బోట్ల చక్రపాణి, గొడుగు వెంకట్, వంకుడోటు వీరన్న నివాళులర్పించారు.

# మహిళ మృతికి కారణమైన వ్యక్తి అరెస్టు



**వరంగల్ వాయిస్, టేకుమట్ల :** మండలంలోని అసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన స్రవంతి అనే అమ్మాయికి గోరికొత్తపల్లి గ్రామానికి చెందిన సాయికుమార్ తో పెళ్లి జరిగింది. స్రవంతి, సాయికుమార్ లు మంచిగానే కలిసి ఉండేవారు. వాళ్లకు ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. స్రవంతికి టేకుమట్ల గ్రామానికి చెందిన మచ్చ రాకేష్ తో పరిచయం కాగా, ఆ పరిచయాన్ని ఆసరాగా చేసుకొని రాకేష్ స్రవంతిని బ్లాక్ మెయిల్ చేసి ఇబ్బందులకు గురి చేసేవాడు. ఈనెల 6న రాకేష్ గోరికొత్తపల్లిలోని స్రవంతి వాళ్ల ఇంటికి వెళ్లి స్రవంతిని నాతో రమ్మని గొడవ చేసి స్రవంతి మామను కొట్టారు. ఈ విషయంలో స్రవంతిని భర్త సాయికుమార్ ఆశిరెడ్డి పల్లికి తీసుకువచ్చి వదిలి వెళ్లాడు. మచ్చ రాకేష్ రెండు కుటుంబాల మధ్యలో చిచ్చుపెట్టి స్రవంతి ఆత్మహత్యకు కారణమయ్యాడు. దీంతో మంగళవారం టేకుమట్లలో అతడి ఇంటి వద్ద అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్ తెలిపారు.

# అక్రమ అరెస్టులను ఖండించండి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని, విద్య రంగానికి పూర్తిస్థాయి విద్యాశాఖ మంత్రిని నియమించాలని, పెండింగ్ స్కాలర్ షిప్, ఫీజు రియింబర్స్ మెంట్ విడుదల చేయాలని, విద్య రంగానికి రాష్ట్ర బడ్జెట్ లో 30శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పీడీఎస్ యూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో "చలో అసెంబ్లీ ముట్టడి" కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద శాంతియుతంగా ఆందోళన నిర్వహిస్తున్న పీడీఎస్ యూ రాష్ట్ర నాయకులను, విద్యార్థులను హైదరాబాద్ పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు అన్ని వర్గాల ప్రజలు ముక్తకంఠంతో ఖండించాలని పీడీఎస్ యూ రాష్ట్ర నాయకురాలు కావ్య, కాకతీయ యూనివర్సిటీ నాయకురాలు పి.అనూషలు కోరారు. మంగళవారం కాకతీయ యూనివర్సిటీ మొదటి గేటు ముందు పీడీఎస్ యూ చలో అసెంబ్లీ ముట్టడి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థి సంఘ నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కావ్య, అనూషలు మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరినందుకు రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యార్థి సంఘ నాయకుల అక్రమ అరెస్టులకు పాల్పడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా గత రెండు రోజుల నుంచి పీడీఎస్ యూ విద్యార్థి సంఘ నాయకులను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అక్రమంగా అరెస్టులు చేస్తూ, పోలీస్ స్టేషన్లలో నిర్బంధిస్తు, అప్రజా స్వామికంగా, నిరంకుశంగా వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు అరెస్టు చేసిన పీడీఎస్ యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు, సహాయ కార్యదర్శి కాంపాటి పృథ్వీ, ఎస్ అనిల్, నరేందర్, భాస్కర్, సాయి, సురేష్, వి.వెంకటేష్, రాకేష్ లతో పాటు అరెస్టు చేసిన మరో 100 మందిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ నాయకులు సాధన, పూజిత, స్వాతి, అఖిల, జ్యోతి, రమేష్, సంజయ్, సుమంత్, బాలు, కళ్యాణ్ అశ్విన్, తదితరులు పాల్గొన్నారు.

# లగచర్ల రైతులను విడుదల చేయాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** పూర్వీకుల నుంచి సాగు చేసుకొని జీవనం కొనసాగించే సాగు భూములు ఇవ్వమని చెప్పిన లగచర్ల రైతులపై అక్రమ కేసులు బనాయించి కాంగ్రెస్ ప్రభుత్వం జైలులో పెట్టిందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తెల్లశ్రీను ఆరోపించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో లగచర్ల రైతులపై అక్రమ కేసులు బనాయించి వారికి బేడీలు వేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ నేతలు అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాలు అందజేసి నిరసన చేపట్టారు. రైతులను జైలు నుంచి విడుదల చేయాలని పార్టీ శ్రేణులు నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టిన రైతులు అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నారని, వారిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు తెల్ల శ్రీను, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

# ఆక్రమణలపై తహసీల్దార్ విచారణ

## ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు




**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** కొన్ని రోజులుగా వస్తున్న అక్రమ నిర్మాణల వార్తలపై రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించారు. వరంగల్ 14వ డివిజన్ ఎస్ఆర్ నగర్ లో ప్రభుత్వ జాగలను గుర్తించి అందులో అక్రమ నిర్మాణాలు చేపట్టకుండా ఉండేలా వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్ బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఇక్బాల్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఎవరు కొనుగోలు చేసిన కఠిన చర్యలు తప్పవని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏనుమాముల సీఐ రెవెన్యూ ఇన్ స్పెక్టర్ వీఆర్ఓ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** సత్యం గ్రూప్ చైర్మన్ గంట రవికుమార్ ఆధ్వర్యంలో వరంగల్ లోని ఉర్సు బైపాస్ రోడ్డు, ముకుందా కాలనీలోని శ్రీ ద్వారక అపార్టుమెంట్ లో గురుస్వామి శ్రీ పోల ఉమామహేశ్వర నేతృత్వంలో శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి మహా పడిపూజ నిర్వహించారు. వేడుకల్లో పెద్ద సంఖ్యలో అయ్యప్ప మాలధారులు, భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తి గీతాలు, అయ్యప్ప నామస్మరణతో ముకుందా కాలనీ మార్మోగింది. వేడుకల్లో పెద్ద సంఖ్యలు భక్తులు పాల్గొన్నారు. అనంతరం తీర్థ, అన్న ప్రసాద వితరణ జరిగింది. ఈమేరకు సత్యం గ్రూప్ నిర్వాహకులను వేద పండితులు పట్టు వస్త్రాలు సమర్పించి, ఆశీర్వాదాలు అందించారు.

## చిప్ప వెంకటేశ్వర్లకు సత్కారం



**వరంగల్ వాయిస్, కొత్తవాడ :** వరంగల్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు పోరండ్ల రత్నాకర్ స్వగృహంలో ఇటీవల బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డు పొందిన చిప్ప వెంకటేశ్వర్లును మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సన్మానం కార్యక్రమంలో రత్నాకర్ కుటుంబ సభ్యులతో పాటు భేతి అశోక్, మండల శంకర్, గుత్తికొండ తిరుపతి పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** మండలంలోని పెంచికలపేట గ్రామానికి చెందిన కందకట్ల రమేష్ తండ్రి దామోదర్ అనారోగ్యంతో మృతి చెందగా బీజేపీ కాంటెస్టెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి పగడాల కాళీ ప్రసాదరావు మృతుడి నివాసానికి వెళ్లి దామోదర్ పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేసిన అనంతరం మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి అన్ని విధాలుగా అండదండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో కాళీ ప్రసాద్ వెంట మండల అధ్యక్షులు బలవంతుల రాజు, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఉప్పుగళ్ల శ్రీకాంత్ రెడ్డి, ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు సముద్రాల రవి, ఇల్లాసరపు రత్నాకర్, అల్లి మహేందర్, గోవిందు రవి, పాల్గొన్నారు.

## అంగన్వాడీ సెంటర్ల తనిఖీ



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని నర్సక్కపల్లి గ్రామంలో అంగన్వాడీ ఒకటి, రెండు, మూడు, నాలుగు సెంటర్లను స్పెషల్ ఆఫీసర్, తహసీల్దార్ గుండాల నాగరాజు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట చేసే ప్రదేశాన్ని, వంట పాత్రలను, వంటను పరిశీలించారు. విద్యార్థులను మెనూపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ కే శ్రీదేవి, అంగన్వాడీ టీచర్లు పి.సరిత, కోడెపాక సుప్రియ, బి.రజిని కుమారి, ఎం.లక్ష్మీ, ఆయాలు రాధ, వనజ, ముత్యాల రమ, గర్భిణీ స్త్రీలు, పిల్లలు, తల్లులు పాల్గొన్నారు.

## పోచమ్మ తల్లికి మొక్కుల చెల్లింపు



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలోని పోచమ్మ అమ్మవారి దేవాలయం వద్ద మంగళవారం స్థానిక శ్రీ పట్టాభి రామాలయ కమిటీ వారు సందర్శించి మొక్కులు ముట్ట జెప్పారు. ధనుర్మాస ఉత్సవాలు విజయవంతం కావాలని, గణపురం మండలం ప్రజలను పాడిపంటలతో పిల్ల పాపలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్ల చేయాలని అమ్మవారికి మొక్కుకున్నట్లు వారు తెలిపారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు, పసుపు, కుంకుమలు, పూలు, పండ్లను సమర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టాభి రామాలయ అర్చకులు ముసునూరి నరేష్, అధ్యక్షులు తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్, కమిటీ సభ్యులు పి.శంకర్, పి.రాజగోపాల్, పి,స్వామి, మొట్టపోతుల రాజన్న గౌడ్, ఎం.మొగిలి, ఎం.అర్జున్, పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ అధికారుల పొలం బాట



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండల కేంద్రంలో వ్యవసాయ అధికారులు మంగళవారం వివిధ పంటల క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి పోరిక జై సింగ్, ఉద్యానవన శాఖ అధికారి తాడూరి మధులిక ఆధ్వర్యంలో వివిధ పంటలపై రైతులకు పలు సూచనలు చేశారు. వరి, మిరప, మొక్కజొన్న పంటలలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. మిరప పంటలో ప్రధానంగా ఎర్రనల్లి, నల్ల తామర, నివారణకు థయోమిథాక్సం 250 ఎంఎల్ ఎకరానికి లేదా టోల్ఫెన్ పైరేడ్ 400 ఎంఎల్ ఎకరానికి ,లేదా ఫ్లూక్సా మెటామైడ్ 160 ఎంఎల్ ఎకరానికి, లేదా ప్రొపగైట్ 250 ఎమ్మెల్ ఎకరానికి పిచికారి చేయాలన్నారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు ఉధృతి నివారణకు కోరాజన్ 60 ఎంఎల్ ఎకరానికి పిచికారి చేయాలని, ఆయిల్ ఫామ్ పంటలో అధిక దిగుబడులు సాధించడానికి మొదటి మూడు సంవత్సరాలలో వచ్చే ఆడ, మగ పూల గుత్తులను క్రమం తప్పకుండా తీసి వేయాలన్నారు. సూక్ష్మ ధాతు లోపల నివారణకు బోరాన్, మెగ్నీషియం పిచికారి చేయాలన్నారు. వరి నారుమళ్లలో జింక్ లోప నివారణకు రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. ఒక ఎకరానికి సరిపడే నారుమడికి ఒక కేజీ నత్రజని ఒక కేజీ బాస్వరం 1/2 కేజీ పోటాష్ లను వేసుకోవాలన్నారు. వరి నాటు వేసే వారం రోజుల ముందు 800 గ్రాముల కార్బోఫురాన్ గుళికలను వరి నారుమడులలో చల్లుకున్నట్లయితే కాండం తొలుచు పురుగు, ఉల్లికోడలను నివారించవచ్చునని తెలిపారు. ఈనెల 19న నడికూడ మండల కేంద్రంలోని రైతు వేదికలో మిరప పంటలపై రైతులకు శాస్త్రవేత్తలచే వ్యవసాయ,ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఉంటుందని, దీనిని మండలంలోని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి జె ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ దమన నీతికి పరాకాష్ట..! సెకండ్ ఏఎన్ఎంల అరెస్ట్



**వరంగల్ వాయిస్, రేగొండ :** తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వ ధమన నీతికి పరాకాష్ట సెకండ్ ఏఎన్ఎంల అక్రమ అరెస్టులు అని రేగొండ సెకండ్ ఏఎన్ఎంల అధ్యక్ష కార్యదర్శులు బొట్ల దీన, కటకం సదాలక్ష్మిలు అన్నారు. మంగళవారం రేగొండ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత 17 సంవత్సరాలుగా సెకండ్ ఏఎన్ఎంలుగా చాలీచాలని జీతాలతో ప్రతి గ్రామంలో, పట్టణాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి సంక్షేమ పథకాలలో సెకండ్ ఏఎన్ఎంలకు ప్రమేయం లేని విషయాలలో కూడా సెకండ్ ఏఎన్ఎంల సేవలను ప్రభుత్వం వినియోగించుకుంటున్నదని, తమకు సంబంధం లేని విషయంలో కూడా ప్రభుత్వానికి తమ వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. కానీ, ప్రభుత్వం సెకండ్ ఏఎన్ఎంల సేవలను గుర్తించి పర్మినెంట్ చేయవలసి ఉండగా గత 17 సంవత్సరాల క్రితం నుంచి పని చేస్తున్న మాకు ఈనెల 28న జరిగే పరీక్షల ద్వారా పాస్ అయితేనే పర్మినెంట్ చేస్తామని అనడం ప్రభుత్వ అవివేకానికి నిదర్శమన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి ఎలాంటి పరీక్షలు లేకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 6500 మంది సెకండ్ ఏఎన్ఎంలను పర్మినెంట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెకండ్ ఏఎన్ఎంలు బి కళావతి, కే మంజుల, ఎన్ రాధిక, వై.జ్యోత్స్న దేవి, కే భాగ్య, ఎన్ యాదలక్ష్మి, బి.అనసూర్య తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకం కార్మికుల అరెస్ట్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా రెండో రోజు హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తూ వంటావార్పుకు సిద్ధమైన కార్మికులను సుబేదారి సీఐ తన సిబ్బందితో వచ్చి అరెస్టు చేశారు. కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి.. సీఐటీయూ జిందాబాద్.. మా సమస్యలను పరిష్కరించాలి, ప్రభుత్వం మొండి వైఖరి నశించాలంటూ కలెక్టరేట్ నుంచి సుబేదార్ పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా కార్మికులు వచ్చారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ నిడిగొండ రజిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్న వారిని అరెస్టు చేయడం ఏంటని వారు ప్రశ్నించారు. ప్రభుత్వం సకాలంలో బకాయిలు చెల్లించడం లేదని తక్షణమే పెండింగ్ బకాయిలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పి.సమ్మక్క, జి శాంత, రాధా, శ్రీలత, మంజుల, కవిత, కొమురన్న, ప్రేమలత, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

# గిరిజన రైతులపై కేసులు ఎత్తి వేయాలి



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** ప్రభుత్వం అక్రమంగా లగచర్ల అమాయక గిరిజన రైతులపైన పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదేశాల మేరకు గూడెప్పాడు గ్రామంలో పార్టీ అధ్యక్షులు సంజీవరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు నిరసన వ్యక్తం చేస్తూ రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ ఫార్మా కంపెనీకి తమ భూములు ఇవ్వమని అన్నందుకు ప్రభుత్వం రైతులపై కక్ష గట్టి అక్రమంగా నిర్బంధించి రైతులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్రహింసల కు గురి చేశారని ఆరోపించారు. నిరుపేద గిరిజనుల పైన అధికారం మదంతో అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపించారని ఆయన మండిపడ్డారు. రైతుల పైన పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దశలవారీగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కాంగ్రెస్ నిర్బంధ పాలన కొనసాగిస్తుందని, పేద, అమాయకుల పైన పోలీసుల చేత నిర్బంధ కాండ కొనసాగిస్తుందని సంజీవరెడ్డి విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచులు రంపిస మనోహర్, మచ్చిక యాదగిరి, సాహోరే కమల రాజేశ్వరరావు, మాదాసి అన్నపూర్ణ రాజు, మైనార్టీ నాయకులు ఎండీ అంకుష్, గ్రామ పార్టీ అధ్యక్షులు పాపని రవీందర్, యూత్ నాయకులు సిరంశెట్టి సుమన్, అర్షం మధుకర్, రేవూరి ప్రవీణ్ రెడ్డి, పెరుమాళ్ల భిక్షపతి, రేవూరి సంపత్ రెడ్డి, వేల్పుల గణేష్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.




# అడివిశేష్‌తో.. మృనాల్ సినిమా

### డెకాయిట్ మూవీ ఫస్ట్ లుక్ వైరల్

టాలీవుడ్ హీరో అడివిశేష్ కాంపౌండ్ నుంచి బ్యాక్ టు బ్యాక్ సినిమాలు లైన్‌లో ఉన్నాయని తెలిసిందే. వీటిలో ఒకటి డెకాయిట్ . షనీల్ డియో కథనందిస్తూ దర్శకత్వం వహిస్తున్నాడు. అంతా అనుకున్నట్టుగా ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్‌ను ఫీ మేల్ లీడ్ రోల్‌లో ఫైనల్ చేశారు. చాలా రోజుల తర్వాత సస్పెన్స్‌కు తెరదించుతూ కొత్త లుక్ విడుదల చేశారు. డెకాయిట్ టీం కొత్త పోస్టర్‌లో మృణాల్ ఠాకూర్ ఓ చేత్తో స్టీరింగ్ తిప్పుతూ.. మరోచేతిలో పిస్తోల్ పట్టుకొని కనిపిస్తుంది. పక్కనే అడివి శేష్ సిగరెట్ వెలిగిస్తున్నాడు. అవును వదిలేసాను.. కానీ మనస్ఫూర్తిగా ప్రేమించాను.. అడివిశేష్‌కు బర్త్ డే విషెస్ తెలియజేసింది మృణాల్ ఠాకూర్. డెకాయిట్‌లో హీరోహీరోయిన్లిద్దరూ ఏదో మిషన్‌లో పాల్గొంటున్నట్టుగా ఉన్న తాజా పోస్టర్ సినిమాపై క్యూరియాసిటీతోపాటు అంచనాలు అమాంతం పెంచేస్తుంది. ఈ ఏడాది ఫ్యామిలీ స్టార్, కల్కి 2898 ఏడీ చిత్రాల్లో మెరిసిన మృణాల్ ఠాకూర్ ప్రస్తుతం నాలుగు హిందీ సినిమాల్లో నటిస్తోంది. అడివి శేష్ మరోవైపు వినయ్ కుమార్ దర్శకత్వం 'గూఢచారి' సీక్వెల్ 'జీ2'లో కూడా నటిస్తున్నాడు. ఈ మూవీ పోస్టర్లు ఇప్పటికే సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. ఈ చిత్రాన్ని పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ బ్యానర్లపై టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.

## స్పిరిట్‌లో..!





అరంగేట్రం చేసిన అనతికాలంలోనే తెలుగులో మంచి గుర్తింపును సంపాదించుకుంది మరాఠీ భామ మృణల్ ఠాకూర్. సీతారామం, హాయ్ నాన్న చిత్రాల్లో ఈ భామ అభినయానికి ప్రశంసలు లభించాయి. ప్రస్తుతం మృణాల్ ఠాకూర్ హిందీ సినిమాలపై ఎక్కువ దృష్టి పెట్టింది. అక్కడ నాలుగు ప్రాజెక్ట్స్‌లో నటిస్తూ బిజీగా ఉంది. తాజా సమాచారం ప్రకారం ఈ భామ తెలుగులో బంపరాఫర్‌ను దక్కించుకున్నట్లు తెలిసింది. ప్రభాస్ 'స్పిరిట్' చిత్రంలో ఆమె కథానాయికగా నటించనున్నట్లు వార్తలొస్తున్నాయి. సందీప్‌రెడ్డి వంగా డైరెక్ట్ చేయబోతున్న 'స్పిరిట్' మూవీ ఇప్పటికే పాన్ ఇండియా స్థాయిలో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. 'యానిమల్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రాబోతున్న ఈ సినిమా ఇదే కావడంతో భారీ అంచనాలేర్పడ్డాయి. ప్రస్తుతం ఈ సినిమా ప్రీప్రొడక్షన్ దశలో ఉంది. జనవరిలో షూటింగ్ మొదలుకానున్నట్లు సమాచారం. ఈ సినిమాలో కథానాయికగా మృణాల్ ఠాకూర్ ఖరారయ్యే అవకాశాలున్నాయని ముంబయి సినీ సర్కిల్స్‌లో వార్తలొస్తున్నాయి. ఇదే గనుక నిజమైతే మృణాల్ ఠాకూర్ కెరీర్‌లోనే ఇదే అతిపెద్ద ఆఫర్ అవుతుందని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి.



# హీరోలకు అదొక హెచ్చరిక

### అల్లు అర్జున్ అరెస్టుపై సుమన్ కామెంట్

ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనకు సంబంధించిన టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఆ తర్వాత బెయిల్‌పై విడుదలయ్యాడు బన్నీ. అల్లు అర్జున్ అరెస్ట్‌పై ఇప్పటికే దేశవ్యాప్తంగా పలువురు సెలబ్రిటీలు తమ స్పందనను తెలియజేశారు. తాజాగా ఈ విషయమై సీనియర్ నటుడు సుమన్ స్పందించారు. అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయడం సరైంది కాదన్నాడు సుమన్. థియేటర్ వాళ్లే హీరోలను పిలుస్తుంటారు. తనను కూడా అప్పట్లో పిలిచేవారని.. తాము ఎప్పుడొస్తారో చెబితే థియేటర్ వాళ్లు ఏర్పాట్లు చేస్తామంటారన్నాడు. హీరో వచ్చినప్పుడు అతడితోపాటు జనాల రద్దీని నియంత్రించే బాధ్యతంతా కూడా థియేటర్ యాజమాన్యానిదేనన్నాడు. హీరోను ఇలా అరెస్ట్ చేయడం తప్పన్న సుమన్.. ఏదేమైనా జరిగిన ఘటనను మార్చలేం. కానీ ఇక ముందు హీరోలకు హెచ్చరిక.. హీరోలు అలా వెళ్లినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చూశాడు. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. తొక్కిసలాట ఘటనలో రేవతి అనే మహిళ ప్రాణాలు కోల్పోగా.. ఆమె కుమారుడు శ్రీతేజ్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను ప్రస్తుతానికి తాను కలవలేక పోతున్నానంటూ.. త్వరలో వారి కుటుంబాన్ని కలుస్తానని ఇప్పటికే ఎక్స్ ద్వారా క్లారిటీ ఇచ్చాడు అల్లు అర్జున్.

# టాలీవుడ్‌కు మరింత దగ్గరగా విజయ్‌సేతుపతి



తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని విజయ్ సేతుపతి. ఈ స్టార్ యాక్టర్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం విడుదల పార్ట్ 2. కోలీవుడ్ దర్శకుడు వెట్రిమారన్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ డిసెంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా కన్నడ, తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మక్కళ్ సెల్వన్ టీం ప్రమోషన్స్‌లో భాగంగా హైదరాబాద్‌లో సందడి చేసింది. కాగా సైరా నరసింహారెడ్డి సినిమాలో కీలక పాత్రలో నటించిన విజయ్ సేతుపతి.. లీడ్ రోల్‌లో డైరెక్ట్‌గా తెలుగు సినిమా మాత్రం చేయలేదు. ప్రమోషన్స్ సందర్భంగా విజయ్ సేతుపతి లీడ్ రోల్‌లో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చే విషయంపై క్లారిటీ ఇచ్చాడు. టాలీవుడ్ దర్శకులు సిద్ధం చేసిన కథలను వింటున్నానని.. తెలుగు సినిమా డెబ్యూకు అవకాశముందని హింట్ ఇచ్చేశాడు. టాలీవుడ్ డెబ్యూపై స్పందిస్తూ.. నేను అదే పనిలో ఉన్నా. త్వరలోనే అది జరుగవచ్చన్నాడు విజయ్ సేతుపతి. ఇప్పుడీ కామెంట్స్‌తో అభిమానులు, మూవీ లవర్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఇదే నిజమైతే మరి విజయ్ సేతుపతిని తెలుగులో ఎలివేట్ చేసే ఆ దర్శకుడెవరన్నది సర్వత్రా ఆసక్తి నెలకొంది. కాగా విడుదల పార్ట్ 2లో సూరి మరో ప్రధాన పాత్రలో నటిస్తుండగా.. మంజు వారియర్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ సినిమాపై అంచనాలు భారీగానే ఉన్నాయి.

# తొలసారి చైతుతో.. శోభిత అప్పుడే చూసిందంట..!



టాలీవుడ్ సెలబ్రిటీలు అక్కినేని నాగచైతన్య–శోభిత ధూళిపాళ్ల ఇటీవలే వైవాహిక బంధంలోకి అడుగుపెట్టారని తెలిసిందే. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఈ ఇద్దరు తమ ప్రయాణానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను తాజాగా ఇంటర్వ్యూలో షేర్ చేసుకున్నారు. 2018లో నాగార్జున నివాసంలో నాగచైతన్య–శోభిత తొలిసారి కలిశారట. స్పై సినిమా గూడఛారిలో తన యాక్టింగ్‌కు ఇంప్రెస్ అయి చైతూ నాన్న నాగార్జున ఇంటికి ఆహ్వానించారని చెప్పింది శోభిత. ఇక సోషల్ మీడియాలో ఒకరినొకరు యాడ్ చేసుకున్న వీరిద్దరూ 2022లో మొదటి సారి చిట్ చాట్ చేశారు. ఆహారం పట్ల తమకున్న ఇష్టం, ప్రేమ గురించి నెట్టింట షేర్ చేసుకున్నారు. ఇద్దరూ ఎప్పుడు కలిసినా ఆహారం గురించి చర్చించుకునేవాళ్లమంది శోభిత. చైతూ తనను తెలుగులో మాట్లాడమని ఎప్పుడూ అడిగేవాడని.. తెలుగులో మాట్లాడటం వల్ల తమ రిలేషన్‌షిప్ మరింత బలపడిరదని చెప్పింది. ఇక రెండు వారాల తర్వాత నాగ చైతన్య తనతో కలిసి లంచ్ చేయడానికి ఫ్లైట్‌లో ముంబైకి వచ్చాడని శోభిత పేర్కొంది. అది చాలా మనోహరమైన విషయం. నేను నెట్టింట టెక్స్టింగ్ చేసేందుకు.. సోషల్ మీడియాలో కమ్యూనికేట్ చేయడానికి అభిమానిని కాదని.. అమెజాన్ ప్రైమ్ వీడియో ఈవెంట్‌లో తాము మళ్లీ కలుసుకున్నామని.. తాను రెడ్ డ్రెస్‌లో ఉండగా.. చైతూ బ్లూ సూట్‌లో ఉన్నాడంటూ చెప్పుకొచ్చింది చెప్పింది. తాము తొలిసారి ముంబైలోని ఓ కేఫ్‌లో కలుసుకున్నామన్న శోభిత.. అప్పుడు తాను ముంబైలో..నాగచైతన్య హైదరాబాద్‌లో ఉండేవాళ్లమంది. తన కోసం చైతూ తరచూ హైదరాబాద్ నుంచి ముంబైకి వచ్చేవాడని తెలిపింది. ఇప్పుడీ కామెంట్స నెట్టింట వైరల్ అవుతున్నాయి. నాగచైతన్య ఫ్యామిలీ న్యూఇయర్ వేడుకలకు నన్ను ఆహ్వానించారు. ఆ తర్వాతి ఏడాదే చైతన్య తన కుటుంబాన్ని కలిశాడని చెప్పింది శోభిత. ఒకరినొకరు అర్థం చేసుకున్న తర్వాత ఈ ఏడాది గోవాలో పెళ్లి ప్రపోజల్ తీసుకొచ్చినట్టు చెప్పింది.

# క్రీడలను ప్రోత్సహిస్తున్నాం..

- అందుకే జిల్లా స్థాయిల్లో సీఎం కప్ పోటీలు
- అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- హైదరాబాద్ నుంచి వర్చువల్ గా ప్రారంభం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** గ్రామీణ ప్రాంతాల్లోని యువతను ప్రోత్సహించి వారు ఒలింపిక్స్ స్థాయిలో పథకాలు సాధించాలనే లక్ష్యంతోనే జిల్లా స్థాయిల్లో సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి కొండ సురేఖ అన్నారు. మంగళవారం వరంగల్ ఓ సిటీ స్టేడియంలో సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలను మంత్రి కొండ సురేఖ వర్చువల్ గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, వర్చువల్ ద్వారా రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా గ్రామీణ, పట్టణ క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలలో తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వయంగా క్రీడాకారుడైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం కల్పిస్తూ, బడ్జెట్ లో క్రీడలకు రూ.375 కోట్లు కేటాయించిందన్నారు. మొత్తం గ్రామీణ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి ఇలా నాలుగు అంచెల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వరంగల్ జిల్లాలోని 13 మండలాల్లో గ్రామీణ, మండల, మునిసిపల్ స్థాయిల్లో నిర్వహించిన పలుక్రీడాంశాల్లో 6 వేలకు పైగా క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటారన్నారు. పారా ఒలింపిక్ క్రీడల్లో జాతీయ పథకాన్ని ఎగరవేసిన దీప్తి జీవన్ జ్యోతిని, జిల్లాకు వన్నె తెచ్చిన మరో ఎంతో మంది క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకొని ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని రాష్ట్ర, దేశ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని మంత్రి కొండా సురేఖ ఆకాంక్షించారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి, ఏకాగ్రతకు, పోటీ తత్వం పెంచడానికి దోహదపడతాయన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, ఓడిపోయిన వారు నిరుత్సాహ పడొద్దని, ముఖ్యంగా కోచ్ లు ఓడిపోయిన క్రీడాకారులకు మానసిక స్థైర్యం కల్పించాలని మంత్రి సూచించారు.

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు, గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని అన్నారు. 17నుంచి 21 వ తేదీ వరకు వరంగల్ లోని ఓ సిటీ స్టేడియంలో, చింతల్ మైదానంలో 36 క్రీడాంశాల్లో నిర్వహించే పోటీల్లో పాల్గొని జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచి, రాష్ట్ర స్థాయిలో అధిక పతకాలు సాధించి వరంగల్ జిల్లాను అగ్రగామిగా నిలపాలని కోరారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా పశుసంవర్ధక అధికారి బాలకృష్ణ, జిల్లా యువజన క్రీడల అధికారి సత్య వాణి, జిల్లా అధికారులు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ కైలాస్ యాదవ్, జిల్లా అధ్యక్షులు వెంకటరమణ, కార్యదర్శి ధనరాజ్ పుశు, పీఈటీలు, కోచ్ లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.




### జేఎన్ఎస్ స్టేడియంలో..

హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలోని శ్యామల దుర్గాదాస్ హ్యాండ్ బాల్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సీఎం కప్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై జిల్లా ఇంచార్జి కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో కలిసి నగర మేయర్ గుండు సుధారాణి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. పరుగు పందెం పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామి రెడ్డి, బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఆర్డీవో రమేష్ రాథోడ్, పీఈటీ సంఘం అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, డీవైఎస్ఓ అశోక్, డీటీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## టీఆర్పీఎస్ రాష్ట్ర కమిటీలో శాయంపేటకు పెద్ద పీట

### పద్మశాలి భవన నిర్మాణ ఇంచార్జిగా బాసాని చంద్రప్రకాశ్

**వరంగల్ వాయిస్, శాయంపేట :** తెలంగాణ రాష్ట్ర పద్మశాలీ సంఘం (టీఆర్ పీఎస్ ) రాష్ట్ర కమిటీలో శాయంపేట మండలానికి పెద్ద పీట దక్కింది. మంగళవారం హైదరాబాద్ హరిహర కళాభవన్ లో అధ్యక్షుడిగా వల్లకటి రాజకుమార్ తోపాటు తెలంగాణ రాష్ట్ర పద్మశాలీ సంఘం అధ్యక్ష, కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. శాయంపేట మండలానికి చెందిన సీనియర్ నాయకులు బాసాని చంద్రప్రకాశ్ రాష్ట్ర పద్మశాలి భవన నిర్మాణ ఇంచార్జిగా నియమతులయ్యారు. అలాగే శాయంపేట మండల కేంద్రానికి చెందిన కందగట్ల రవీందర్, కొప్పుల గ్రామానికి చెందిన సామల మధుసూదన్ రాష్ట్ర కార్యదర్శులుగా, పెద్దకోడెపాక గ్రామానికి చెందిన వావిలాల వేణుగోపాల్, గట్లకానిపర్తికి చెందిన గుర్రం అశోక్ రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రెటరీలుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు రాష్ట్ర స్థాయి పదవులు రావడానికి కృషి చేసిన టీఆర్ పీఎస్ స్టేట్ ప్రెసిడెంట్ వల్లకటి రాజ్ కుమార్, రాష్ట్ర నాయకులు చందా మల్లయ్య, బాసాని చంద్రప్రకాశ్ తదితరులకు ధన్యవాదాలు చెప్పారు. ఈ సందర్భంగా వారికి పలువురు మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు, స్నేహితులు శుభాకాంక్షలు తెలిపారు.

## ధైర్యంగా ఫిర్యాదు చేయండి

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** మహిళలపై రోజురోజుకు నేరాలు, అఘాయిత్యాలు పెరుగుతున్న నేపథ్యంలో వాటి అదుపులో ఆశ వర్కర్స్ కూడా కీలక పాత్ర పోషించాలని, మనము జాగ్రత్తతో మెలగడం ద్వారా నేరాలను అదుపు చేయవచ్చని వరంగల్ షీ టీమ్ కంచి విద్యాసాగర్ అన్నారు. వరంగల్ లోని డీఎంహెచ్ఓ ఆఫీస్ లో సుమారు 200 మంది ఆశ వర్కర్స్ కు మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, అఘాయిత్యాల పట్ల అవగాహన కల్పలించారు. ముఖ్యంగా అమ్మాయిలు ఫేస్ బుక్, ఇన్ స్టా గ్రామ్ లాంటి సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫోటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలన్నారు. సైబర్ నేరాలపై, టి-సేఫ్ ఆప్ పై అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి ఫిర్యాదు చేయాలన్నారు. గుర్తు తెలియని నెంబర్స్ నుంచి మహిళలకు ఎవరైనా ఫోన్ చేసి ఇబ్బందులుకు గురిచేస్తే ధైర్యంగా షీ టీమ్ కు సమాచారం ఇవ్వాలన్నారు. సీపీ వాట్సాప్ నెంబర్ 8712685257, సీఐ వాట్సాప్ నెంబర్ 8712685142, ఎస్సై వాట్సాప్ నెంబర్ 8712685270 కు ఫిర్యాదు చేయాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచి నేరస్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి చర్య తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డీపీహెచ్ జ్ఞాన సుందరి, డీప్యూటీ డెమో అనిల్ కుమార్, షీ టీమ్ నుంచి హెడ్ కానిస్టేబుల్ బి.భాస్కర్, కానిస్టేబుల్ కె.వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటాలు

### ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షులు తక్కళ్ళపల్లి శ్రీనివాస్ రావు

**వరంగల్ వాయిస్, నెక్కొండ :** తెలంగాణలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయాలని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షులు తక్కళ్ళపల్లి శ్రీనివాస్ రావు విద్యార్థులను కోరారు. మంగళవారం హైదరాబాద్ లో జరిగిన ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్ రావు మాట్లాడుతూ కేజీ నుంచి పీజీ వరకు విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వీటిపై విద్యార్థులను సమీకరించి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. గురుకుల పాఠశాలలో విషాహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని, ఫీజు రీయింబర్స్మెంట్ అమలు చేయకపోవడంతో వేలాదిమంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, యూనివర్సిటీలలో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయకపోవడంతో యూనివర్సిటీల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని శ్రీనివాస్ రావు విమర్శించారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు బాల నర్సింహా, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ ఇటిక్యాల రామకృష్ణ, గ్యార నరేష్, గ్యార క్రాంతి, రెహమాన్, రాజు, సోతుకు ప్రవీణ్ పాల్గొన్నారు.

## విద్యా కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి

### ఏఐఎఫ్ డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున

**వరంగల్ వాయిస్, వరంగల్ :** శాస్త్రీయ విద్య సమ సమాజ స్థాపనకై, ఆధిపత్య, అనువాద, విద్యా కాషాయీకరణను వ్యతిరేఖంగా పోరాడాలని ఏఐఎఫ్ డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. మంగళవారం ఓంకార్ భవన్ బాగ్లింగంపల్లి హైదరాబాద్ లోని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశం సంఘ రాష్ట్ర అధ్యక్షులు పల్లె మురళి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య(ఏఐఎఫ్ డీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం వలన పేద బడుగు, బలహీన వర్గాలు చదువుకు దూరమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఈ జాతీయ నూతన విద్యా విధానాల పేరుతో విద్యా కార్పొరేటికరణ, కషాయికరణ చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. ఈ పేరుతోనే ఎస్సెస్సీ బోర్డు ఎత్తివేయడం జరుగుతుందన్నారు. 5 + 3 + 3+ 4 అనే విధానం తీసుకొచ్చి విద్యను కషాయికరణ చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం చూస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం ముసుగులో పాఠ్య పుస్తకాల్లో మత బోధలు చేర్చి మనువాదాన్ని బోధిస్తున్నారు. విద్యాలయాల్లో విద్యార్థుల సమస్యలు పరిష్కరించుటకై, సమాజంలో ఉన్న అసమానతలు తొలగిపోవాలని, సమ సమాజ స్థాపనకై, ప్రైవేటు, కార్పొరేట్ విద్యా వ్యాపారీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. లేనిపక్షంలో అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున ఆందోళనకర ఉద్యమాలను ఉధృతం చేస్తామని ప్రభుత్వాలకి హెచ్చరికలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య రాష్ట్ర నిర్మాణ బాధ్యులు వస్కుల మట్టయ్య, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి ఉపాధ్యక్షులు వస్కుల భరత్, కోశాధికారి పోతుగంటి కాశి, కమిటీ సభ్యులు టి.కుమార్, గడ్డం శ్రీకాంత్, ఇమ్మానియేల్ పాల్గొన్నారు.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com